వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం

షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రాధన్యతనిస్తోందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మండల పరిధిలోని చించోడ్ గ్రామంలో నిర్మించిన రైతు వేదికను మంగళవారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, వ్యవసాయ సాగు పై చర్చించేందుకు వీలుగా ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించిందని అన్నారు. గతంలో రైతులందరు కలిసి మాట్లాడుకునేందుకు వేదికలు ఉండేవి కావని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాలను యూనిట్‌గా తీసుకొని రైతు వేదికలను నిర్మించామని వివరించారు, రైతులను రాజు చేయాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారని అన్నారు. ఎండిపోయిన పంట పొలాలకు సాగు నీరు అందించడం ద్వారా రాష్ట్రంలో పెద్ద ఎత్తున రైతులు ధాన్యాన్ని పండిస్తున్నారని అన్నారు. ఇతర రాష్ట్రాలకు ధాన్యాన్ని ఎగుమతి చేసే స్థాయికి రాష్ట్రం ఎదిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ రాజావరప్రసాద్, ఎంపీపీ ఖాజా ఇద్రీస్, రైతు సంఘం కోఆర్డినేటర్ తాండ్ర వెంకట్‌రెడ్డి, సర్పంచ్ బాలమణి, దామోదర్, ఏడీఏ రాజారత్నం, ఏఓ నిషాంత్‌కుమార్, ప్రణీత, తేజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

కేసీఆర్‌ను మరోసారి సీఎం చేద్దాం

మంత్రి మహేందర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: బీఆర్‌ఎస్‌ను గెలిపించి కేసీఆర్‌ను మరో సారి సీఎం చేద్దామని మంత్రి మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య ఎన్నికల ఖర్చుకోసం తోల్‌కట్ట ఎంపీటీసీ మాజీ సభ్యుడు ముంద్రా రవీందర్ రూ.1.16లక్షలను మంత్రి చేతుల మీదుగా ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చేవెళ్ల గడ్డపై యాదయ్యను హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిపించేందుకు ప్రజలు కార్యకర్తలంతా సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కనకమామిడి సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, నాయకులు గణేశ్ రెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల కోసం వినతి

మండల పరిధిలోని కనకమామిడిలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి 2019లో శంకుస్థాపన చేసి వదిలేశారని.. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి బీజేపీ నాయకులు, గ్రామస్తులు మంత్రి మహేందర్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. లేదంటే పేదలకు 100 గజాల స్థలాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పద్మనాభం తదితరులున్నారు.


మంత్రి చేతుల మీదుగా ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న రవీందర్

క్లుప్తంగా

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జెడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్: మండల పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రిపట్నం మహేందర్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య బుధవారం శంకుస్థాపన చేస్తారని జెడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. మధ్యాహ్నం 2గంటలకు మండల పరిధిలోని మాచన్‌పల్లి నుంచి పోతుగల్ వరకు రూ.కోటితో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణం పనులకు, 3గంటలకు హైతాబాద్ గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామమైన హంకుగూడ గ్రామానికి రూ.1 కోటి నిధులతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, హైతాబాద్ సర్పంచ్ మల్లేష్, మండల కో ఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, మాజీ సర్పంచ్ దర్శన్, ఉపసర్పంచ్‌లు గోపాల్, గోపాల్ నాయక్ తదితరులున్నారు.

రేపు మంత్రి కేటీఆర్ పర్యటన


హెలీపాడ్‌ను పరిశీలిస్తున్న సీఐ సురేశ్ తదితరులు

నందిగామ: రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ గురువారం నందిగామ మండలానికి రానున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నమయింది. మండల పరిధిలోని చాకలిదానిగుట్ట తండా సమీపంలో హెలీపాడ్ ఏర్పాట్లను స్థానిక బీఆర్‌ఎస్ నేతలతో కలిసి సీఐ సురేశ్ మంగళవారం పరిశీలించారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో సర్పంచ్ రాజు నాయక్, నాయకులు మిట్లూనాయక్, గబ్రూనాయక్, తులసీరాం నాయక్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న సమ్మె


సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కేశంపేట: డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం కొనసాగింది. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మెలో కూర్చున్న కార్మికులు ప్రభుత్వం స్పందించి ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లలిత, సత్యమ్మ, వెంటకమ్మ, అక్కమ్మ, కళావతి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బంది అరెస్టు


పోలీస్‌స్టేషన్‌లో అంగన్‌వాడీ టీచర్లు

కేశంపేట: రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మండల పరిధిలోని సంగెం, అల్వాల గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంగళవారం వచ్చారు. రాష్ట్ర మంత్రిని కలిసి తమ సమస్యలను తెలిపేందుకు సిద్ధమైన వారిని ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసులు స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. పోలీసుల అదుపులో జయమ్మ, మమత, భాగ్యలక్ష్మి, సంతోష, శశికళ, సుమల్య, సువర్ణ, సుమతమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు తాగునీరు అందిస్తాం

బీజేపీ మండల అధ్యక్షుడు కుర్మయ్య


వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న బీజేపీ నాయకులు

కొందుర్గు: తండాలలో వాటర్ ప్లాంట్లను ఏర్పాటుచేసి గిరిజనులకు తాగునీరు అందించడమే పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి లక్ష్యమని బీజేపీ జిల్లేడ్ చౌదరిగూడ మండల అధ్యక్షుడు కుర్మయ్య అన్నారు. నమో సేవాలాల్ శుద్ధ జలం పథకంలో భాగంగా పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి సొంత ఖర్చులతో ఏర్పాటుచేయనున్న 50 వాటర్ ప్లాంట్లలో మంగళవారం బీజేపీ నాయకులు జిల్లేడ్ చౌదరిగూడ మండలం రుక్కాలి తండా, కొందుర్గు మండలం కాస్లాబాద్ తండాలలో ప్లాంట్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గబ్రునాయక్, లక్ష్మణ్‌నాయక్, గోవింద్ నాయక్, నరేశ్, రూపేశ్, శంకర్, దశరథ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సేవలు అభినందనీయం

స్త్రీ, శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల

కేశంపేట: అంగన్‌వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని స్త్రీ, శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ తాండ్ర విశాలారెడ్డి అన్నారు. మంగళవారం జెడ్పీ కార్యాలయంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ స్థాయి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాలారెడ్డి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సిబ్బంది గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు నిరంతరం సేవలందిస్తున్నారన్నారు. అనంతరం దుర్గాబాయి మహిళ శిశు వికాస కేంద్రం కార్యక్రమాల వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ రంగారావు, డబ్ల్యూఓ పద్మజ, మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు నిత్యానిరంజన్‌రెడ్డి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విశాల

'ఆశ'లకు కనీస వేతనం చెల్లించాలి


ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు


షాద్‌నగర్ రూరల్: ఆశవర్కర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

- లేదంటే ఆందోళన ఉధృతం చేస్తాం
- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్

చేవెళ్ల: ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని లేదంటే ఆందోళన ఉధృత చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దేవేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దేవేందర్ ఆధ్వర్యంలో ఆశవర్కర్లు ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశ వర్కర్లు తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సమస్యను వైద్యారోగ్య శాఖమంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి, సలహాదారులు ధనలక్ష్మి, షాబాద్ మండల అధ్యక్షకార్యదర్శులు కృష్ణవేణి, మాదవి, కోశాధికారి జయమ్మ, స్వప్న, సబిత, మంజులరాణి, లలిత, సరిత, నిర్మల, తదితరులున్నారు.

పనికి తగిన వేతనం ఇవ్వాలి

షాద్‌నగర్‌రూరల్: ఆశ కార్యకర్తలకు పనికి తగిన వేతనాలను ఇవ్వాలని సీఐటీయూ నాయకుడు శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. క్యాంపు కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నాకు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ.. ఆశలకు పనికి తగిన వేతనాలను ఇవ్వడం లేదని.. కనీస వేతనం కింద రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆశ యూనియన్ జిల్లా కోశాధికారి లలిత మాట్లాడుతూ... గతంతో పోలిస్తే ఆశ వర్కర్లకు పనిభారం పెరిగిందన్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సబ్ సెంటర్, బస్తీ దవాఖానాలో పని చేయిస్తున్నారని అన్నారు. పనిభారంతో పాటుగా నిత్యావసర ధరలు పెరగడంతో వేతనాలు సరిపోక తీవ్ర ఇబ్బందులకు గరవుతున్నామన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ క్యాంపు కార్యాలయానికి చేరుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వంద రోజుల్లో 'గ్యారెంటీ'లు అమలు


కమ్మదనంలో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీ స్కీంలు అమలు చేస్తామని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కమ్మదనంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు అమర్ ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శంకర్ ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించారు. పేదల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. పార్టీ పూర్వ వైభవానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ అరుణఅంజయ్యగౌడ్, నాయకులు రఘు, నవీన్, చెంది తిరుపతిరెడ్డి, కృష్ణయ్య, నర్సింలు, విఠలయ్య, చిన్నయ్య, నర్సింలు, తిరుపతయ్య, శ్రీకాంత్, చంద్రశేఖర్, రాజు, సత్యనారాయణ, రాఘవేందర్, శివ, మాధవరెడ్డి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆడపడుచులకు ప్రభుత్వ సారె

ఎంపీపీ రవీందర్‌యాదవ్

కేశంపేట: ప్రతీ సంవత్సరం బతుకమ్మ ఉత్సవాలకు ప్రభుత్వం ఆడపచులకు సారెలుగా చీరెలు పంపిణీ చేస్తోందని ఎంపీపీ రవీందర్ యాదవ్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ మరో అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేశంపేట, కొత్తపేట, లేమామిడి, పాపిరెడ్డిగూడ సర్పంచులు తలసాని వెంకట్‌రెడ్డి, నవీన్‌కుమార్, శ్రీశైలంగౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, లక్ష్మీనారాయణగౌడ్, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఏపీఎం భగవంతు తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రవీందర్‌యాదవ్

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

షాబాద్: మండల కేంద్రంలో మిలాద్ ఉన్ నబీ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మంగళవారం మండల కేంద్రంలో జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు మౌలానా, మోహిద్దీన్‌ఖాద్రీ, నేమతుల్లాఖాద్రీ, మసూద్, ఖాజా, మఖ్దుమ్, ముర్తుజా, బీఆర్‌ఎస్ నాయకులు మతీన్, ఆయూబ్, ఇమ్రాన్, ఇబ్రహీం, గౌస్, షమీమ్, ఇమ్రాన్, అజ్జుభాయ్, మజీద్, మునీర్, రుక్కుద్దీన్, సోదరులు తదితరులున్నారు.

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్



కేశంపేట: బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్‌ను ఎంపిక చేసినట్టు నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ తెలిపారు. మండల పరిధిలోని కాకునూర్ గ్రామానికి చెందిన సొంటె శ్రీనివాస్‌ను నూతన అధ్యక్షుడిగా నియమిస్తూ.. ఇక్కడ అధ్యక్షుడిగా పనిచేసిన హరికుమార్‌ను నియోజకవర్గ కార్యవర్గ సభ్యుడిగా నియమించినట్టు ఆయన వివరించారు. బీఎస్పీని ఇంటింటికీ తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని నూతన మండల కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్ తెలిపారు.

నిరుపేద యువకుడి చేయూత

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన మాసనోళ్ల ప్రశాంత్ వెన్నెముక సమస్యతో అనారోగ్యానికి గురయ్యాడు. వైద్యులు ఆపరేషన్ చేయాలని చెప్పాడంతో ఆర్థిక సమస్యతో ఇబ్బందులు పడుతున్నాడు. ప్రశాంత్ పరిస్థితిని స్థానికులు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన మంగళవారం యువకుడికి ట్రస్ట్, నిర్వాహక సభ్యులు డాక్టర్ అఖిల్ రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మహేశ్, నరేశ్, అశోక్, వంశీ, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

ఏకపక్షంగా ఐఆర్ ప్రకటించడం సరికాదు

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటప్ప

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో చర్చించకుండా కేవలం 5శాతం ఐఆర్‌ను ప్రకటించడం సరికాదని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటప్ప అన్నారు. మంగళవారం తక్కువ ఐఆర్ ప్రకటనను నిరసిస్తూ టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాయికల్, చించోడ్, వెలిజర్ల తదితర ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లాబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ నాయకుడు చంద్రారెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు వెంకటయ్య, శివారెడ్డి, నర్సింలుగౌడ్, శ్యామలదేవి, మండల నాయకులు కృష్ణయ్య, శేఖర్‌గౌడ్, రవికుమార్, బాలయ్య, చంద్రశేఖర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సంక్షేమాన్ని చూసి చేరికలు


ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న సురంగల్ యువత

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్: ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్‌ఎస్ వైపు ఆకర్షితులవుతున్నారని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని సురంగల్ గ్రామానికి చెందిన కొంత మంది యువకులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గ్రామంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి సర్పంచ్ గడ్డం లావణ్య అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య సమక్షంలో మంగళవారం గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ విషయాలను గుర్తించి చాలా మంది బీఆర్‌ఎస్‌లో చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. గ్రామంలోని కాటమయ్యగుడ్డంలో గౌడన్నలు ఈత చెట్లు పెంచుకోవచ్చని, రజకులకు దోబీగార్డు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. పార్టీలో చేరినవారిలో అశోక్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సామయ్యగౌడ్, మహేందర్, శివకుమార్‌గౌడ్, దేవేందర్‌గౌడ్, పాండు, మహేష్, రమేష్, ఎట్టయ్యగౌడ్, మధు, సాయి, ఓంప్రకాష్, నవీన్, రాజు, లింగం, యాదయ్య, లక్ష్మయ్య, బిక్షపతిగౌడ్, నర్సింహ్మాగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, భూషణం, కిష్టగౌడ్, యాదయ్య, మహేందర్, హరీష్, రవీందర్, మల్లేష్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గడ్డం అంజిరెడ్డి, వార్డు సభ్యుడు భాస్కర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం హామీలు అమలు చేయాలి

జిల్లా సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల నాయకులు

చేవెళ్ల: కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని జిల్లా సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అక్టోబర్ 3ను బ్లాక్ డేగా ప్రకటించాలన్నారు. యూపీలోని లక్కింపూర్‌కేరి కేసులో రైతు లు, విలేకరి మరణానికి కారణమైన కేంద్ర మంత్రి అజయ్‌మిశ్రాను మంత్రి వర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు కూలీ పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు పి.నాగిరెడ్డి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యాక్షుడు ఎం.ప్రభు లింగం, చేవెళ్ల కన్వీనర్ ఎం.సుధాకర్‌గౌడ్, సీఐటీ యూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్, సీపీఐ మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, మండల సహాయ కార్యదర్శి మక్బూల్, నాయకులు సుభాన్‌రెడ్డి, మంజుల, మాధవి, విజయమ్మ, అన్నపూర్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మల్లేశ, మల్లారెడ్డి, అంజయ్య, శంకర్‌గౌడ్, తదితరులున్నారు. అనంతరం అంగన్‌వాడీల దీక్షకు మద్దతు తెలిపారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో 37 పల్లె, బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని కోనాపూర్‌లో మంగళవారం మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావు ఆధ్వర్యంలో ఆయుష్ చక్ర సంచార వైద్యశాలలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. పేదలకు సంచార వైద్యశాలతో వైద్యం అందించడంపై అర్జున్‌రావు, డా.సునీతలను ఎమ్మెల్యే అభినందించారు. అంతకుముందు జరిగిన సభలో జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఒక మహోన్నత శక్తి అని అన్నారు. దేశంలో ఏరాష్ట్రంలో లేనివిధంగా సంక్షేమం పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. కేసీఆర్ సహకారంతో కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. పల్లె, బస్తీ దవాఖానాల కోసం రూ.20 లక్షలతో ఒక్కో భవనం నిర్మిస్తున్నామని తెలిపారు. పట్టణంలో నూతనంగా 50 పడకల ఆస్పత్రిని మంజూరు చేయించి రూ.17.50 కోట్లతో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. కడ్తాల్‌లో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆయన వివరించారు. అలాగే కల్వకుర్తికి 77 వేల బతుకమ్మ చీరలు వచ్చినట్లు ఎమ్మెల్యే చెప్పారు. కోనాపూర్ సర్పంచ్ మ ల్లమ్మ, సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేశ్, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నారాయణ, ఎంపీటీసీ కుమార్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ బాల్‌రాం తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి నిరంతర కృషి

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: కడ్తాల్: మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ పేర్కొన్నారు. మండలంలో సీసీరోడ్ల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణంతో పాటు, వివిధ అభివృద్ధి పనులకు, జిల్లా పరిషత్ నుంచి నిధులు మంజూరు చేయాలని, జెడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డిని కోరామన్నారు. మంగళవారం మండలంలో అభివృద్ధి పనులకు, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి రూ.25 లక్షల ప్రొసీడింగ్‌ను అందజేసిందని చెప్పారు. ఈ సందర్భంగా దశరథ్‌నాయక్ మాట్లాడుతూ.. జెడ్పీటీసీగా ఎన్నికైనప్పటి నుంచి జిల్లా పరిషత్ నుంచి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయించి, మండల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేసినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో, తండాల్లో అక్కడక్కడ మిగిలి ఉన్న సీసీ రోడ్ల నిర్మాణం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణానికి నిధులు అవసరం ఉండటంతో, ఇటీవలే జెడ్పీ చైర్ పర్సన్‌ను కలిసి సమస్యలు వివరించడంతో పాటు, నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.


ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి